సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



ఆధ్యాత్మిక క్షేత్రం..లంకమల

సిద్దవటం లంకమల అభయారణ్యంలో లభ్యమైన శాసనాలు, బండరాళ్లపై చెక్కిన పేర్లతో శైవ క్షేత్రంగా ఈ ప్రాంతం వర్ధిల్లినట్టు వెలుగులోకి వచ్చింది. -8లో



ఘనంగా పార్వేట ఉత్సవం

లక్కిరెడ్డిపల్లి మండలం అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ జాతరలో శుక్రవారం పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)


	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 51 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఈనెల 4న ఇంటర్వ్యూ



రాయచోటి జగదాంబసెంటర్: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న హిందీ గెస్ట్ లెక్చరర్ పోస్ట్ భర్తీకి ఈ నెల 4వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలతాపంకజ్ శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు హిందీ పీజీ డిగ్రీలో 55 శాతం మార్కులతో పాటు కనీస అనుభవం కలిగి ఉండాలన్నారు. ఏపీ సెట్, నెట్, పీహెచ్‌డీ లాంటి అదనపు విద్యా అర్హతలు కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో మంగళవారం ఉదయం ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

ఉర్దూ కవిసమ్మేళనానికి ఆహ్వానం



మహమ్మద్ హాషిం

రాయచోటి అర్బన్: తమిళనాడు రాష్ట్రంలో ఫిబ్రవరి 1,2 తేదీల్లో జరిగే జాతీయ ఉర్దూకవి సమ్మేళనానికి రాయచోటి పట్టణానికి చెందిన ఉర్దూకవి మహమ్మద్ హాషీంకు ఆహ్వానం అందింది. ఫిబ్రవరి 1న తమిళనాడులోని తిరుప్పాత్తూరులో అంజుమన్ మొహిబ్బానే ఉర్దూ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ ఉర్దూకవి సమ్మేళనంలో ఆయన పాల్గొననున్నారు. అలాగే వేలూరు జిల్లా జామియా దారుస్సలాం ఉమ్రాబాద్‌లో జరిగే కార్యక్రమంలో కూడా పాల్గొంటారు. ఉర్దూ ఉపాధ్యాయులు అంజద్‌బాషా,సునీర్ అహమ్మద్, జాఫరుద్దీన్, లెక్చరర్లు అసదుల్లాషా, జాఫర్, ఉర్దూకవులు సదా, దర్బార్‌హావి, నియాజ్ అహమ్మద్, గౌస్‌షాద్, హాఫీజ్, సయ్యద్ ఫర్హన్‌లు మహమ్మద్ హాషింకు అభినందనలు తెలిపారు.

జై వాసవాంబ



రాజంపేటలో గుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

రాజంపేట టౌన్: 'వాసవీమాతాకీ జై' అంటూ భక్తులు ప్రణమిల్లారు. 'మమ్మల్ని చల్లగా చూడు తల్లీ' అని వేడుకున్నారు. శుక్రవారం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ఆర్యవైశ్యులు వేడుకగా చేపట్టారు.

బడ్జెట్ రైలు ఆగేనా!



- నేడు పార్లమెంట్‌లో కేంద్రబడ్జెట్
- 'రైల్వే'పురోగతి, కేటాయింపులపై గంపెడాశలు



కడప రైల్వేస్టేషన్

రాజంపేట: పార్లమెంట్‌లో రైల్వే బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టనున్నారు. ఏటా ప్రవేశపెడుతున్న రైల్వే బడ్జెట్‌లో ఉభయ జిల్లాల రైల్వేలకు అనుకున్న స్థాయిలో నిధులు కేటాయించడం లేదు. గత బడ్జెట్‌లో కేవలం పాత ప్రాజెక్టులకే నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారు. దక్షిణ మధ్య రైల్వేలో ఆదాయపరంగా ముందంజలో ఉన్నా రైళ్ల కేటాయింపులు, పొడిగింపుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఉభయ జిల్లా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఉభయ జిల్లాలో ఇప్పటికీ రైలుకూతకు నోచుకోని సెగ్మెంట్ల సెంటర్లు ఉన్నాయి. రాయచోటి, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, గిద్దలూరు-భాకారోపేట , ప్రొద్దుటూరు-కంభం, ముద్దనూరు-ముదిగుబ్బ రైలుమార్గాలు సర్వేకు పరిమితమయ్యాయి.
- ముంబై-చెన్నై ప్రధాన రైలుమార్గం పేరుకే...రైళ్లు అరకొరే. వందేభారత్, అమృత్‌భారత్ లాంటి రైళ్లను ఈ మార్గంలో నడిపించరు. కోస్తా రైలు మార్గాలకు ఇచ్చిన ప్రాధాన్యం ఇక్కడి వాటికి ఇవ్వలేదన్న అపవాదును కేంద్ర రైల్వేమంత్రిత్వశాఖ మూటకట్టుకుంది.
- కడప-బెంగళూరు మధ్య రైలు నిర్మాణానికి 2010 సెప్టెంబర్‌లో అప్పటి రైల్వేశాఖ మంత్రి మునియప్ప శ్రీకారం చుట్టారు. ఈ రైలుమార్గానికి 2008-2009 బడ్జెట్‌లో ఆమోదం లభించింది. రూ.1000కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఐదేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పుడు ఈ లక్ష్యం ఐదేళ్లు కాదుకదా..15యేళ్లు దాటిపోయేలా కనిపిస్తోంది. భూసేకరణకు రూ.199.2కోట్లు కేటాయించారు. కడప-బెంగళూరు రైలుమార్గం నాలుగుఫేజ్‌ల్లో నిర్మాణం చేపట్టాలని రైల్వేశాఖ నిర్ణయించింది. మొదటిదశలో రూ.153కోట్లు కేటాయింపులు జరిగాయి. భూసేకరణకు సంబంధించి రూ.89కోట్లలో రూ.20కోట్లు వ్యయం చేశారు. కడప నుంచి గంగనపల్లె, పెండ్లిమర్రి వరకు లైన్ నిర్మాణం చేపట్టారు. అక్కడితో లైన్ ఆగిపోయింది. ఈలైన్ పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం వాటాను ఇవ్వాల్సి ఉంటుంది.
- బ్రిటీషుకాలం నుంచి ఉన్న నందలూరు రైల్వేకేంద్రం నిరుపయోగంగా మారుతున్న క్రమంలో రైల్వేబోర్డు దృష్టి సారించింది. నందలూరుకు సంబంధించి వివిధ అంశాలపై పరిశీలన చేసి, సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులకు సూచించింది. రాజంపేట లోక్‌సభసభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి రైల్వేబోర్డు చైర్మన్ అనిల్‌కుమార్ లోహిత్‌ను కలిసి నందలూరు రైల్వేకేంద్రం పూర్వవైభవం, ఇప్పుడున్న పరిస్థితులను వివరించారు. దీంతో రైల్వేబోర్డులో కదలిక వచ్చింది. తర్వాత ఎన్నికల సమయం రావడంతో అటకెక్కింది. నందలూరు రైల్వేకేంద్రం నిరుపయోగంగా మారడానికి గుంతకల్ డివిజన్ ఉన్నతాధికారుల పాత్ర కీలకంగా ఉందన్న ఆరోపణలు వెలువడుతున్నాయి.
- నందలూరు రైల్వేకేంద్రంలో వాటరింగ్ ప్రతిపాదన కోవిడ్-19 ముందు చేశారు. సర్వే కూడా నిర్వహించారు. రూ.35లక్షలకుపైగా వ్యయం అవుతుందని అంచనా వేశారు.అయితే ఈ ప్రతిపాదన కరుమరుగైంది.
- డివిజన్ కేంద్రంగా తిరుపతిని చేస్తే కాట్పాడి నుంచి గుంతకల్, నెల్లూరులో గూడూరు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లా పరిధిలో 700 కిలోమీటర్ల దూరం వస్తుంది. 400 కిలోమీటర్లు ఉంటే డివిజన్‌గా ప్రకటించవచ్చునని రైల్వే నిపుణులు అంటున్నారు.

కడప-బెంగళూరు లైనుకు బడ్జెట్ నిధులిలా..

ఏడాది	కేటాయింపులు
2016-2017	రూ.58కోట్లు
2017-2018	రూ.240కోట్లు
2018-2019	రూ.175 కోట్లు
2022-2023	రూ.289 కోట్లు
2023-2024	రూ.10లక్షలు

జిల్లాలు: వైఎస్సార్, అన్నమయ్య
ప్రధానరైల్వేకేంద్రం: నందలూరు
జంక్షన్లు: కడప, ఓబులవారిపల్లె, ఎర్రగుంట్ల
ఉభయజిల్లాలమీదుగా నడిచే రైళ్లు: 30 (డౌన్, అప్)
గూడ్స్‌రైళ్లు: 40
స్టేషన్లు: 25
కార్మికులు: 4000
కిలోమీటర్లు: 180

కొత్తరైళ్లు వేయరూ...

- ఉభయజిల్లాల మీదుగా బెంగళూరుకు వెళ్లేందుకు రైలొక్కటి కూడా లేదు.
- గుత్తి-రేణిగుంట రైలుమార్గంలో ఉభయ వైఎస్సార్ జిల్లాల్లో గ్రామీణ ప్రాంత ప్రయాణికులకు ప్యాసింజర్ రైళ్ల సౌకర్యం కల్పించే ప్రతిపాదనలు ఏవీ పట్టాలెక్కడంలేదు.
- ఉభయ వైఎస్సార్ జిల్లాలను కలుపుతూ నెల్లూరుకు డైలీ డెమోరైలును తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.
- విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, రాపూరు, ఓబులవారిపల్లె, రాజంపేట,నందలూరు మీదుగా కడప వరకు ఎక్స్‌ప్రెస్ రైలును తీసుకొస్తే అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.
- పెన్నా ఎక్స్‌ప్రెస్ పేరుతో హిందుపూరం నుంచి వయా ధర్మవరం, అనంతపురం గుత్తి, డోన్, నంద్యాల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె మీదుగా నెల్లూరు వరకు రైలును తీసుకొస్తే సీమలోని కడప, అనంతపురం, నెల్లూరు జిల్లా మధ్య రాకపోకలకు సులభతరమవుతుంది.
- రాత్రి వేళలో నడుస్తున్న ముంబై-చెన్నై రైలు మార్గంలో రాత్రి వేళలో నడిచే నైన్‌మెయిల్, టెన్‌మెయిల్ రైళ్లు ఇప్పుడు లేకుండా చేశారు.

ఓబులవారిపల్లె-కృష్ణపట్నం లైన్ ఉన్నా..

రూ.6,660 కోట్లతో ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైల్వే లైన్ అందుబాటులోకి వచ్చింది.సెప్టెంబరు1న 2019 లో రైలును ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ మార్గంలో ప్యాసింజర్ రైలును నడిపించలేదు. కర్నూలు, నంద్యాల, కడప, నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, నెల్లూరు మీదుగా రైలు ప్రయాణాలు కొనసాగించేందుకు వీలైవుతుంది. ఈ విధమైన ప్రతిపాదనలను రైల్వే అధికారులు చేయడంలేదు.

బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలి



బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలి. దీనివల్ల నందలూరుకు పూర్వవైభవం వస్తుంది. కొత్తజోన్ వస్తున్న క్రమంలో తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పాటుపై ఎంపీలు దృష్టి సారించాలి. బడ్జెట్‌లో నందలూరు రైల్వేకు న్యాయం జరుగుతుందని నమ్మకలేదు. -ఆర్ముగం విశ్వనాథ్, ప్రధానకార్యదర్శి, ఐకెపీఎస్, నందలూరు

ప్రయాణికులకు ఎప్పుడూ నిరాశే..



ఎన్‌డీఏ మూడుసార్లు అధికారంలోకి వచ్చిన సందర్భంగా ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌లో రైల్వేపరంగా ఉభయ జిల్లాల రైల్వేలకు మొండిచెయ్యే చూపించింది. ప్రతిసారి ప్రయాణికులను నిరాశపరిచింది. -తల్లెంభరత్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు, రైల్వేకోడూరు

మోదీ బడ్జెట్‌లో సీమ రైల్వేకు అన్యాయం



ప్రధాని మోదీ సర్కారు మూడుసార్లు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాయలసీమ రైల్వేలకు అన్యాయం జరిగింది. ఇది వాస్తవం. జిల్లా మీదుగా అనేక రైళ్ల కరోనా ముందు హాల్టింగ్ ఉండేవి, ఇప్పుడు అవి ఎత్తేసి ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారు. ఈ సారి బడ్జెట్‌లో ఉభయ జిల్లా రైల్వేలకు కొత్తరైళ్లు, కేటాయింపులు ఉంటాయని ఆశిద్దాం. -మహేష్, సీపీఐ నేత, అన్నమయ్య జిల్లా

సింహంపై నరసింహుడు



సింహ వాహనంపై కడపరాయుడు

కడప కల్చరల్: కడప రాయుడు శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. అరాచకాలు సృష్టిస్తున్న దుష్టులను అంతం చేసి, శిష్ట రక్షణ చేసేందుకు దేవదేవుడు నరసింహుడై గర్జించాడు. శత్రువులను తునియలు చేసేందుకు విక్రమించాడు. ఆయుధ ధారియై పరాక్రమంతో వెళుతున్న ఆ పురుషోత్తముడిని చూసి భక్తులు తన్మయులయ్యారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం చిన్న శేష వాహనంపై మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా మాడవీధుల్లోని భక్తులు తమ ఆరాధ్య దైవమైన కడప రాయుడు తమ ఇంటి ముంగిళ్లకే తరలి వచ్చి కరుణించే భాగ్యం ఇవ్వడంతో తన్మయులయ్యారు. పూజా ద్రవ్యాలు సమర్పించి మొక్కుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వాహన సేవ అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజన సేవ చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో కనుల పండువగా ఏర్పాటు చేసిన ఊయలపై సేద తీర్చారు. మంగళ వాయిద్యాలు, గాయకుల కమ్మని సంగీతం వింటూ స్వామి వింజామర సేవల మధ్య విశ్రమించారు. అనంతరం సింహంపై మలయప్పగా కడప రాయుడు నరసింహునిగా కొలువుదీరి భక్తులను కరుణించాడు. మహిళా భక్తబృందాలు పురుష బృందాలతో పోటీపడుతూ కోలాటాలు, భజనలు నిర్వహించారు. ప్రత్యేక వాయిద్య బృందాలు స్వామిని కీర్తిస్తూ సంగీతార్చన చేస్తూ ఊరేగింపుగా సాగారు.

ఏసీబీకి చిక్కిన అవినీతి ఖాకీలు

- సీఐ, ఎస్ఐ ఇళ్లలో ఏసీబీ సోదాలు
- డీఎస్పీ ప్రమేయంపై విచారణ చేస్తున్న ఏసీబీ అధికారులు



రూరల్ సీఐ రమేష్‌నాయుడు, ఎస్ఐ వెంకటసుబ్బయ్యలను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

మదనపల్లె: అన్నమయ్య జిల్లా రామసముద్రం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య రూ.70వేలు లంచం తీసుకుంటూ గురువారం సాయంత్రం ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. అయితే.. ఏసీబీ అధికారుల విచారణలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య, మదనపల్లె రూరల్ సీఐ రమేష్‌నాయుడు ఆదేశాల మేరకు తాను లంచం తీసుకున్నట్లు తెలపడంతో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ఇద్దరినీ విచారిస్తే.. డీఎస్పీ కొండయ్యనాయుడుకు ఇందులో ప్రమేయం ఉందని చెప్పడంతో ఏసీబీ అధికారులు ముగ్గురినీ విచారించారు. ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా ఎస్ఐ వెంకటసుబ్బయ్య పట్టుబడినప్పటి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఏసీబీ అధికారులు, ముగ్గురిని తమ అదుపులోనే ఉంచుకుని విచారణ కొనసాగించారు. మదనపల్లె పట్టణంలోని ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సీఐ రమేష్ ఇళ్లలో ఏసీబీ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి, కడప డీఎస్పీ జెస్సీ ప్రశాంతి మీడియాతో మాట్లాడుతూ...అన్నమయ్యజిల్లా రామసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో జనవరి 23న రోడ్డు ప్రమాదం కేసులో ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. లారీని రిలీజ్ చేసేందుకు తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన లారీ ఓనర్ కె.మనోజ్‌ను రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, మదనపల్లె రూరల్ సీఐ రమేష్‌నాయుడు రూ.70వేలు లంచం డిమాండ్ చేశారన్నారు. పోలీసులకు లంచం ఇవ్వడం ఇష్టం లేని లారీ ఓనర్ కడప జిల్లా ఏసీబీ అధికారులకు ఫిర్యాదుచేశారన్నారు. గురువారం సాయంత్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, లారీ ఓనర్ మనోజ్‌ను రామసముద్రం శ్రీనివాసపురం రోడ్డులోని పెట్రోల్‌బంక్ వద్దకు లంచం డబ్బులు తీసుకురావాల్సిందిగా కోరాడు. లారీ ఓనర్ ఎస్ఐకి రూ.70వేలు లంచం ఇస్తుండగా, ఏసీబీ అధికారులు పట్టుకున్నారన్నారు. సీఐ రమేష్‌నాయుడు ఆదేశాల మేరకు లంచం తీసుకున్నానని ఎస్ఐ చెప్పడంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిని నెల్లూరులోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపారు. అయితే...డీఎస్పీ కొండయ్యనాయుడు ప్రమేయంపై ఏసీబీ అధికారులు ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ, సుదీర్ఘంగా విచారించడంతో కేసులో ఆయనే ప్రధాన సూత్రధారి అన్నట్లు జోరుగా ప్రచారం జరిగింది. డీఎస్పీ కొండయ్యనాయుడును ఏసీబీ అధికారులు అరెస్ట్‌చేశారని, అయితే రాజకీయ ఒత్తిళ్లు అధికమవడంతో ఆయనను కేసు నుంచి తప్పించినట్లు విశ్వసనీయ సమాచారం.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

సంబేపల్లె: ఎన్టీఆర్ పింఛన్లపంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబేపల్లె మండల కేంద్రానికి రానున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి,ఎస్పీ విద్యాసాగర్ నాయుడులు శుక్రవారం పరిశీలించారు. పోలీసు సిబ్బందితో కలసి మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. హెలిప్యాడ్, బారికేడ్లు, భద్రతా చర్యలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యటన వివరాలు ఇలా....

రాయచోటి: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆయన ఉదయం విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానం ద్వారా మధ్యాహ్నం 12.05 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా సంబేపల్లె మండల కేంద్రం పీఎస్ కాలనీ సమీపంలో హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం అక్కడే ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం సంబేపల్లెలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుంది. ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. ఇంటింటా పెన్షన్ల పంపిణీ, లబ్ధిదారులతో మాటామంతీ కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం 3.50 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకొని ప్రత్యేక విమానం ద్వారా విజయవాడకు వెళతారు.

బాబు గారూ..గుర్తున్నాయా!

- 'రాయచోటిని అభివృద్ధి చేసే బాధ్యత నాదే' అన్నారు
- పెండింగ్ పనులకు మోక్షం లేదా?
- ఇతర హామీల సంగతి తేల్చాలంటున్న జిల్లా వాసులు
- నేడు సంబేపల్లెకు రానున్న సీఎం చంద్రబాబు



చిన్నమండెం మండలం సమీపంలోని శ్రీనివాసపురం (నాగిరెడ్డి) రిజర్వాయర్

సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు....అన్నింటికీ నాదే బాధ్యత అంటూ చంద్రబాబు చెప్పిన మాటలను ప్రజలు గుర్తు చేస్తున్నారు. బాబు గారూ గుర్తున్నాయా? అంటూ అడుగుతున్నారు. అధికారంలోకి వస్తే ఒకటేమిటి...అనేక రకాలుగా జిల్లాను తీర్చిదిద్దుతామని చెప్పినప్పటికీ ఇప్పటికీ అడుగులు పడలేదు. అధికార పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలు దాటినా జిల్లాలో అభివృద్ధి పనుల జాడ చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పరిస్థితి కనిపిస్తోంది. రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో పర్యటించిన చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదాలో అధికారంలోకి రాగానే రూపురేఖలు మారుస్తామన్నా..హామీల అమలులో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదని మేధావులు అభివర్ణిస్తున్నారు.

రాయచోటి అభివృద్ధి మాటేమిటి?

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో సార్వత్రిక ఎన్నికలకు పది రోజుల ముందుగా భారీగా హాజరైన జనసందోహాన్ని ఉద్దేశించి ప్రసంగించిన సందర్భంలో చంద్రబాబు రాయచోటి రూపురేఖలు మారుస్తామని చెప్పినా కనీసం పెండింగ్ పనులకు మోక్షం లేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో చేపట్టిన అనేక రకాల అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

మదనపల్లె మెడికల్ కళాశాలపై నీలి నీడలు: జిల్లాలోని ప్రధాన వాణిజ్య నగరమైన మదనపల్లె అభివృద్ధికి చాలా హామీలు ఉన్నా అమలు దిశగా అడుగులు పడటం లేదు. వైఎస్ జగన్ సర్కార్ మదనపల్లెకు మెడికల్ కళాశాల మంజూరు చేసి భవనాలు కూడా నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభించాలని ఏర్పాట్లు చేసినా అధికారంలోకి వచ్చిన తర్వాత సీట్లను కూడా కేటాయించకపోవడంతో కళాశాలపై నీలినీడలు అలుముకున్నాయి. ప్రస్తుతమున్న పెద్దాస్పత్రిని కూడా ప్రైవేటు పరం చేస్తున్నారని ఆందోళనలు కూడా కొనసాగుతున్న తరుణంలో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి అంతే

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా చక్రాయపేట మండలం కాలేటి వాగు నుంచి సుమారు తంబళపల్లె వరకు తీసుకుపోయే కాలువలకు సంబంధించి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెద్ద ఎత్తున బిల్లులు కూడా ఆగిపోయాయి. చివరి దశలో ఉన్న శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసి పూర్తి చేయాల్సి ఉంది. అయితే వీటికే నిధుల కేటాయింపుకు అవరోధాలు ఉండగా, బనకచర్ల నుంచి ప్రత్యేక కాలువల ద్వారా నీరు దేవుడెరుగు అంటూ పలువురు చెవులు కొరుక్కుంటున్నారు. సంబేపల్లె మండల పరిధిలోని ఝరికోన ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం లేకపోవడంతో చుక్కనీటిని కూడా అందుకోలేని పరిస్థితిలో ఉన్నారు. రెండు పర్యాయాలు ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరైనా సాంకేతిక కారణాలతో ఆ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. చంద్రబాబు ఆ ప్రాజెక్టుపై దృష్టి సారించి ఎత్తిపోతల పథకం ద్వారా సంబేపల్లె, రాయచోటి, వీరబల్లి మండలాల్లోని చెరువులకు నీటిని అందించాల్సిన అవసరం ఉంది. చిన్నమండెం మండల పరిధిలోని శ్రీనివాసపురం (నాగిరెడ్డి) రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేసిన కాలువ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. అలాగే ప్రాజెక్టుకు పటిష్టమైన గేట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ రెండు ప్రాజెక్టుల పనులు పూర్తిచేయడంతోపాటు హంద్రీ-నీవా నీటిని ఈ ప్రాజెక్టులకు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఎన్నికలకు ముందు చెప్పిన అనేక హామీలను అమలు చేయాలని ప్రజలు చంద్రబాబు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితమైన అన్నమయ్య ప్రాజెక్టు

జిల్లాలో భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటి ప్రవాహానికి పింఛాతోపాటు అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయి. అయితే అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించి టెండర్ల వరకు తీసుకొచ్చినా మళ్లీ అంచనాల రూపకల్పనతో ఆగింది. ఈలోపు అధికార పగ్గాలు చేపట్టిన కూటమి సర్కార్ అన్నమయ్య ప్రాజెక్టు గురించే పట్టించుకోవడం లేదు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి నష్టపోయిన గ్రామాల ప్రజలతో ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మమేకమైన సందర్భంలోనూ ప్రాజెక్టు గురించి చర్చించారు. ఎన్నికల ముందు రాజంపేట సభలో కూడా అన్నమయ్య ప్రాజెక్టు నిర్మిస్తాన్న హామి ఇచ్చారు. కానీ ఇప్పటికీ ప్రతిపాదనల దశ దాటలేదు. రాజంపేటకు సంబంధించి మెడికల్ కళాశాల తీసుకు వస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో పండ్ల తోటలు అధికంగా ఉన్న నేపథ్యంలో పరిశ్రమలు తీసుకొస్తామన్నా ఎనిమిది నెలల కాలంలో ఏదీ కనిపించడం లేదు. ఉద్యాన హబ్‌ల మాటలకు ప్రతిపాదన దశ దాటలేదు.

తలనీలాల వేలం ద్వారా రూ.18,76,800 ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన సంతాన దేవత రెడ్డెమ్మకొండ ఆలయంలో తలనీలాల సేకరణ వేలం ద్వారా రూ. 18,76,800 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మంజుల తెలిపారు. శుక్రవారం స్థానిక ఈఓ కార్యాలయంలో మదనపల్లె దేవదాయశాఖ అధికారి శశికుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఐదుగురు పాట దారులు రూ. 5లక్షలు చొప్పున ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలానికి చెందిన సరోజమ్మ అనే మహిళ వేలంలో కాంట్రాక్టు దక్కించుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బాలకృష్ణ, మహేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐదు నిమిషాల్లో రూ. 12 లక్షలు చోరీ

కురబలకోట : మండలంలోని అంగళ్లులో శుక్రవారం మధ్యాహ్నం 3.45 గంటలకు రూ.12 లక్షలు నగదు చోరీ అయినట్లు బాధితుడు లేపాక్షి ఫజరుల్లా ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు..అంగళ్లుకు చెందిన ఫజరుల్లా ఓ ఏటీఎంకు చెందిన క్యాష్ లోడింగ్ ఫ్రాంచైజీస్ తీసుకున్నారు. పదేళ్లుగా ఏటీఎంలకు క్యాష్ లోడింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం భోజనానికి రూ.12 లక్షలతో ఇంటికి వెళ్లాడు. ఓ రూములో క్యాష్ పాటు రెండు మొబైల్ ఫోన్లు ఉన్న బ్యాగును పక్క రూములో ఉంచి భోజనానికి వెళ్లాడు. ఐదు నిమిషాల తర్వాత తిరిగి వచ్చి చూడగా క్యాష్ బ్యాగ్ మాయమైందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటనపై వివిధ కోణాల్లో విచారిస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

బీహార్‌కు చెందిన వ్యక్తి గండి మడుగులో పడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

గాలివీడు : ప్రమాదవశాత్తు కాలు జారి గండి మడుగులో పడి బీహార్‌కు చెందిన ధీరజ్ కేసరి (25) మృతి చెందాడు. ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు బీహార్ రాష్ట్రంలోని అరరియా జిల్లా గంజ్ తాలూకా పర్వహ గ్రామానికి చెందిన మహేందర్ కేసరి కుమారుడు ధీరజ్ కేసరి ఇటీవలే తూముకుంట సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో పనిలో చేరాడు. అయితే జనవరి 29 వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3.45 గంటల సమయంలో తన స్నేహితుడు బచ్చన్ మండల్‌తో కలసి గండి మడుగులోని దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న నీటి మడుగులో చేపలు పెట్టేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి మునిగిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రెండు రోజుల పాటు గాలింపు చర్యల అనంతరం శుక్రవారం మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు స్పష్టం చేశారు.

లాడ్జీలో వ్యభిచారం


జమ్మలమడుగు రూరల్ : ముద్దనూరు రహదారిలో ఉన్న ఓ లాడ్జిలో వ్యభిచారం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు పట్టణ సీఐ ఎస్. లింగప్ప సిబ్బందితో కలసి శుక్రవారం దాడి నిర్వహించారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా.. ముద్దనూరు రహదారిలో ఉన్న లాడ్జీలో ఇతర ప్రదేశాల నుంచి అమ్మాయిలను పిలిపించి వ్యభిచారం నిర్వహిస్తుండటంతో లాడ్జీ ఓనర్ చప్పిడి విజభాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు పట్టణ పరిధిలోని లాడ్జీలో అసాంఘిక కార్యాకాలాపాలు నిర్వహించినట్లు తెలిస్తే లాడ్జీల యజమానులపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆధ్యాత్మిక క్షేత్రం..లంకమల

- 18వ శతాబ్దికి చెందిన చెన్నకేశవ విగ్రహాలు లభ్యం
- లభించిన శాసనాల ఆధారంగా శైవం వర్ధిల్లినట్టు ఆనవాళ్లు
- అభయారణ్యం మీదుగానే తిరుమలకు రాజుల రాకపోకలు
- 16వ శతాబ్ది నాటి నీటిబావి సాక్ష్యం
- ఉత్తరాది నుంచి శైవ భక్తులు వచ్చినట్టు అంచనా


16 శతాబ్దిలో నిర్మించిన నీటిబావి


లభ్యమైన 13వ శతాబ్దికి చెందిన వీరగల్లు విగ్రహం


లభ్యమైన 18వ శతాబ్దికి చెందిన చెన్నకేశవ విగ్రహం

బి.కొత్తకోట : జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం సిద్దవటం లంకమల అభయారణ్యంలో లభ్యమైన 4 నుంచి 16 శతాబ్దాలకు మధ్య చెందిన శాసనాలు, బండరాళ్లపై చెక్కిన పేర్లతో ఇక్కడ శైవ క్షేత్రంగా ఈ ప్రాంతం వర్ధిల్లినట్టు వెలుగులోకి రావడం తెలిసిందే. దీనికి బలం చేకూర్చుతూ ఇదే ప్రాంతానికి సంబంధించి తాజాగా శుక్రవారం మరో రెండు ఫొటోలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఫొటోలతో లంకమల శైవ, వైష్ణవాలకు ఆధ్యాత్మిక క్షేత్రంగా వర్ధిల్లినట్టు స్పష్టం అవుతుండగా పురావస్తుశాఖ అధికారులు కూడా ఏకీభవిస్తున్నారు. కొండూరు, రోళ్లబోడు, ముత్తుకూరు, మద్దూరు, సిద్దవటం, వెలుగుపల్లి, జంగాలపల్లి అభయారణ్య ప్రాంతాల్లో 4 నుంచి 14వ శతాబ్దాలకు చెందిన మానవ లిపి, భాషతో చెక్కిన శాసనాలు లభ్యమైన విషయం తెలిసిందే. ఐదు శతాబ్దాల తేడా కలిగిన కొత్తగా లభ్యమైన ఫొటోలను పరిశీలిస్తే శైవులతో పాటు వైష్ణవులకు ఆరాధ్యమైన క్షేత్రమని అర్థమవుతోంది..ఈ వివరాల్లోకి వెళ్తే..

13వ శతాబ్ది వీరగల్లు

అభయారణ్యంలో 13వ శతాబ్దికి చెందిన వీరగల్లు విగ్రహం లభ్యమైంది. ఇది ఒక యోధునికి సంబంధించిన విగ్రహం. అంటే ఇతను ఈ ప్రాంతానికి చెందిన పాలకుడు కావొచ్చు లేదంటే యుద్ధ వీరుడు అయ్యుండొచ్చు. ఇతను శివుడి ఆలయం ఎదుట భక్తితో పూజిస్తున్నట్టుగా విగ్రహం ఉంది. అంటే ఈ విగ్రహం ఆలయం ఎదుట ప్రతిష్టించే అవకాశాలే ఎక్కువ. ఈ విగ్రహంలోని వీరుడు భక్తితో రెండు చేతులు జోడించి నమస్కరిస్తున్నాడు. తల కుడివైపు శివలింగం ఉంది. కుడివైపు పెద్ద కత్తి ధరించి ఉన్నాడు. ఇతను వీరుడితోపాటు శివ భక్తుడు అన్నది స్పష్టమైంది. లంకమల అభయారణ్యంలో అతిపురాతన శివాలయం ఉంది భావిస్తున్నారు. ఇంతకుముందు వెలుగులోకి వచ్చిన శాసనాలు, ఆధారాల మేరకు శివుడ్ని కీర్తించడం తెలిసిందే.

18వ శతాబ్ది చెన్నకేశవ విగ్రహం

లంకమల అభయారణ్యంలో 18వ శతాబ్దికి చెందిన వైష్ణవానికి చెందిన చెన్నకేశవ విగ్రహం లభ్యమైంది. విజయనగర పాలన లేదా ఆ తర్వాతి పాలనలో ఈ విగ్రహం ప్రతిష్టించినట్టు దాన్ని పరిశీలించాక పురావస్తుశాఖ అధికారులు తెలిపారు. ఈ చెన్నకేశవ విగ్రహానికి నాలుగు చేతులు ఉన్నాయి. వెనుక చేతుల్లో శంఖు, చక్రాలు, ముందున్న చేతుల్లో కుడి చేతి అభయహస్తంపై తామర పుష్పం ఉంది. ఎడమచేతిలో గద ఉంది. కింద చెన్నకేశవుడికి ఇరువైపులా వింజామర్లు విసురుతున్న పరిచారకుల బొమ్మలు ఉన్నాయి. వైష్ణవానికి సంబంధించిన విగ్రహాల సర్వూపం బట్టి ఏ కాలానికి చెందినదో అర్థమవుతుంది, అలాగే విగ్రహాల చేతుల్లోని ఆయుధాలను బట్టి కూడా పేర్లు మారుతుంటాయి. ఈ విగ్రహం ఆనవాళ్లను బట్టి 18వ శతాబ్దంలో లంకమల అభయారణ్యంలో వైష్ణవం ఉన్నట్టు అర్థమవుతుంది. దీనితో 4 శతాబ్ది నుంచి శైవం ఉండగా ఆ తర్వాతి కాలంలో వైష్ణవ మతం కూడా వర్ధిలిందని తెలుస్తోంది. కాగా విజయనగర పాలన అనంతరం సిద్దవటం పాలకులైన అరవీటి పాలకుల కాలంలో చెన్నకేశవ ఆలయాన్ని నిర్మించడమో లేక అప్పటికే ఉన్న ఆలయాన్ని పరిరక్షించి ఉండటమో చేసి ఉండోచ్చన్న అభిప్రాయాన్ని పురావస్తుశాఖ అధికారులు వ్యక్తం చేశారు.

ఉత్తరాది నుంచి లంకమలకు..

4వ శతాబ్దికి చెందిన శైవ ఆనవాళ్లు పరిశీలించిన పురావస్తుశాఖ ఇంకో అభిప్రాయం వ్యక్తం చేసింది. లంకమల అభయారణ్యం ప్రశాంతతతో కూడిన వాతావరణం కలిగివుండటం ఉంటుంది. లంకమల లోయ, అటవీప్రాంతంతో సమీపంలోనే పెన్నా నది పరవళ్లు తొక్కుతూ సాగిపోతుంటుంది. ఇక్కడ సిద్దులు, యోగులు తపస్సు చేసుకునేందుకు అనువైంది. ఈ ప్రాంతం గురించి తెలుసుకుని ఉత్తరాది నుంచి అఘోరాలు, శైవ భక్తులు ఇక్కడికి వచ్చి ఉన్నట్టు శాసన ఆధారాల ద్వారా చెబుతున్నారు. శైవ భక్తులతో అధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లినట్టు శాసనాలు చెబుతున్నాయి.

లంకమల నుంచే తిరుమలకు..

రాజ్యాలను పాలించిన రాజులు శేషాచలం కొండల్లో కొలువైన శ్రీవెంకటేశ్వరున్ని దర్శించుకునేందుకు లంకమల అభయారణ్యం మీదుగానే వెళ్లడమే ఏకైక రహదారి. రేనాటి చోళులు, బాణులు, వైదుంబులు, విజయనగర రాజులు..ఇలా రాజ్యాలు పాలించిన రాజులు తిరుమలకు వెళ్లే మార్గం ఇదే. దీనితో ఆయా రాజ్యాల పాలకుల మత విశ్వాసాల మేరకు శైవ, వైష్ణవం వర్ధిల్లి ఉంటుంది. కాగా లంకమల అడవిలో రాకపోకలు ఉండేవని చెప్పడానికి వెలుగుచూసిన 16 శతాబ్దికి చెందిన బావి నిదర్శనం. బాటసారులు, వన్యప్రాణులకు తాగేందుకు నీళ్లు ఉండేలా ఈ బావిని తవ్వించారు. ఈ బావి ఇప్పటికి చెక్కు చెదరలేదంటే అడవిలో ఉండటమే కారణం. కాలక్రమంలో రహదారులు ఏర్పడటం, ఆధునిక నాగరికత సంతరించుకోవడంతో అడవిమార్గం మరింత దట్టమైన అడవిగా విస్తరించి ఆనవాళ్లు లంకమల ఒడిలో నిక్షిప్తమై శతాబ్దాల నాగరికతకు, నాటి విశిష్టతకు నిలయమైంది.

కేబుల్ దొంగల బారి నుంచి కాపాడండి

- పోలీసులకు అగ్రహారం రైతుల ఫిర్యాదు
- ఒక్క రాత్రిలో దాదాపు 40 బోరుబావుల వద్ద కేబుల్ వైర్లు చోరీ
- రూ. 6 లక్షలకు పైగా రైతులకు నష్టం


కేబుల్ వైర్ చోరీని చూపుతున్న రైతు

నిమ్మనపల్లె : మండలంలోని అగ్రహారం గ్రామంలో కేబుల్ దొంగలు పెద్ద ఎత్తున కేబుల్ వైర్ల చోరీకి పాల్పడ్డారు. ఒక్క రాత్రిలోనే దాదాపు 40 బోరు బావుల వద్ద, కేబుల్ వైర్లను దోచుకున్నారు. ఉదయాన్నే బోరు బావులు వద్దకు వెళ్లిన రైతులు లోబోదిబోమంటూ తమకు జరిగిన అన్యాయంపై మీడియాను ఆశ్రయించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలను విలేకరులకు తెలిపారు. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు చుట్టుపక్కల బోరు బావుల కింద దాదాపు 200 ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం వరకు బోరు బావుల వద్ద వ్యవసాయ పనులు చేసుకుని తిరిగి ఇళ్లకు చేరుకున్నారు. అయితే రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజాము వరకు కేబుల్ వైర్ల చోరీ ముఠా దాదాపు 40 బోరు బావుల వద్ద కేబుల్ వైర్ల చోరీకి పాల్పడ్డారు. ప్రతి బోరుబావు వద్ద స్టార్టర్ లోని ఫీజులు తీసి పక్కన పెట్టి, కేబుల్ వైర్లు కత్తిరించి, అత్యంత చాకచక్యంగా, భూమి లోపలి కేబుల్ బయటకు తీసి, పెద్ద ఎత్తున చోరీకి పాల్పడ్డారు. బహిరంగ మార్కెట్లో కేబుల్ వైర్ ఒక మీటరు రూ. 100–120 ధర ఉంది. చోరీలో దాదాపు ప్రతి రైతు రూ. 10 నుంచి 15 వేల రూపాయల నష్టం కలిగిందని. చోరీ అయిన కేబుల్ వైర్ల విలువ రూ. నాలుగు లక్షల పైగా ఉంటుందని, బోర్ మోటార్ల రిపేరీ ఖర్చు రైతులకు దాదాపు రెండు లక్షలకు పైగా అవుతుంది. ఈ లెక్కన మొత్తంగా రూ ఆరు లక్షలకు పైగా రైతులకు నష్టం వాటిలిందని వాపోయారు. వెంటనే కేబుల్ దొంగలను పట్టుకుని తమను ఆదుకోవాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దిరెడ్డిపై ఆరోపణలు హేయమైనవి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

ఒంటిమిట్ట : మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలు హేయమైనవని వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని రాచపల్లి గ్రామంలో కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీప్రాంతంలో భూసేకరణ చేసి విలాసమైన భవనం కట్టుకున్నారనే ఆరోపణలు చేశారన్నారు. సంక్షేమ పథకాలన్ని ఇవ్వలేను అని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలను ప్రజలు మరచిపోయే విధంగా డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన ప్రతిసారి ఇలా వైఎస్సార్ సీపీ నాయకులు ఏదో స్కాములు చేశారని, అక్రమాలు చేశారని చెప్పి ప్రభుత్వం చేసిన తపులను ప్రజలు మరచిపోయే విధంగా డైవర్షన్ చేస్తున్నారన్నారు. సమావేశం అనంతరం రాచపల్లి గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకేశుల సుభాన్ నూతన గృహ ప్రవేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆకేపాటి హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, గృహనిర్మాణ సంస్థ కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, నాయకులు బ్యాంకు శివారెడ్డి, సాంబశివారెడ్డి, బాష తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేదిలేదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలపై కూటమి నాయకులు అపసత్య ఆరోపణలు చేసినా, కొన్నిపత్రికలు తప్పుడు రాతలు రాసినా సహించేదిలేదని వైఎస్సార్సీపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు, రాష్ట్రంలో పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న ఆదరణ ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు మూడుతరాలు రాజకీయాలలో ఉన్నారని, వారు ఎన్నడూ ఆక్రమణలు, అరాచకాలు చేయలేదన్నారు. టీడీపీ నాయకుల్లా అడ్డగోలు సంపాదనలు సంపాదించాల్సిన ఖర్మ పట్టలేదన్నారు. ప్రతిరోజూం చంద్రబాబు, కూటమి నాయకులకు పెద్దిరెడ్డి నామశ్మరణ చేయనిదే రోజు గడవడడం లేదని ఎద్దేవా చేశారు. కోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, నాయకులకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కేవలం వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో తాము మంజూరు చేయించిన పనులకు టెంకాయలు కొడుతూ కాలం వెల్లబుచ్చుతున్నారన్నారు. 2019, 2024 మధ్యలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం, అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందించి, అక్రమాలు, అవినీతి లేకుండా సంక్షేమం, అభివృద్ధి అందిస్తూ పాలన సాగించారని గుర్తు చేశారు. చిత్తూరు జిల్లాలో టీడీపీకి భవిష్యత్ ఉండదనే ఆలోచనతో ఆధారాలు లేని, కుట్రపూరిత దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పంజం సుకుమార్‌రెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, రమణ, ఎంపీటీసీ మల్లి, రాజగోపాల్, డీవీరమణ, గల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

అట్లూరు : గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు బద్వేలు రూరల్ సీఐ నాగభూషణ్ , స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలిలా..కడప పట్టణం మాసాపేటకు చెందిన పూల లక్ష్మిదేవి నెల రోజుల క్రితం కొండూరు ఎస్సీ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుంది. ఇక్కడి నుంచి కడపకు తీసుకెళ్లి గంజాయి విక్రయించేది. శుక్రవారం ఎస్సీకాలనీలో ఉన్న గంగమ్మ గుడి దగ్గర ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని పెద్దమనుషుల సమక్షంలో తనిఖీ చేయగా 1100 గ్రాముల గంజాయి లభించింది. కేసు నమోదు చేసి ఆమెను పోలీసులు కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

సర్వసభ్య సమావేశమా.. కూటమి నేతల సభనా?

– సభకు వచ్చిన కూటమి నాయకులు


సమావేశంలో సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు కన్నా ఎక్కువగా హాజరైన కూటమి నాయకులు

ఓబులవారిపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల కన్నా కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో మండల సర్వసభ్య సమావేశమా.. కూటమి నాయకుల పార్టీ సమావేశమా అన్నట్లుగా నిర్వహించారు. మండల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రతి మూడు నెలలకు మండల సర్వసభ్య సమావేశాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించాలి. అయితే నిబంధనలు పాటించకుండా ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు పెద్ద సంఖ్యలో కూటమి నాయకులను కూర్చోబెట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. మండల పరిషత్ నిధులతో పనులు పూర్తిస్థాయిలో చేయాలని అధికారులు కోరారు. పంచాయతీరాజ్ డీఈ బాలనరసింహులు మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 57 కోట్లతో రోడ్డు పనులు జరుగుతున్నాయని, రెండు కోట్లతో వై.కోట నుంచి మండకోనకు సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, వైద్య అధికారులు తమ శాఖల నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీరల నాగమ్మ, ఎంపీడీఓ మల్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి ప్రసాద్, సర్వే డీటీ రామ్మోహన్, ఎస్ఐ మహేష్, వైస్ ఎంపీటీసీలు అమృతాల విజయ్ కుమార్, దుర్గా ప్రసాద్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విధులు సీటీఎంలో.. పనిచేసేది మదనపల్లెలో

సీనియర్ అసిస్టెంట్ బాగోతం


ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సిబ్బందికి సంబంధించిన బిల్లులు ఆన్‌లైన్ చేస్తున్న రాజేష్

మదనపల్లె : పని చేయాల్సిన చోట డుమ్మా కొట్టి, ఆదాయం కోసం మరోచోట పనిచేస్తూ కాసులు వసూలు చేసుకుంటున్న ఓ అధికారి బాగోతం శుక్రవారం బయటపడింది. వైద్య ఆరోగ్యశాఖ నియంత్రణలోని సీనియర్ అసిస్టెంట్ రాజేష్ మదనపల్లి మండలం సీటీఎం పీహెచ్‌సీలో విధులు నిర్వహించాల్సి వుండగా, ఆయన అధిక శాతం పని దినాలు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పని చేస్తూ ఆదాయార్జనలో ముందుంటున్నాడు. ఒక వైపు పీహెచ్‌సీలో విధులు నిర్వహించినందుకు గాను జీతం పొందుతూ, మరోవైపు జిల్లా ఆసుపత్రిలోని సిబ్బంది జీతాలకు సంబంధించిన బిల్లులు ఆన్‌లైన్ చేసే క్రమంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఆసుపత్రిలో పని చేసే ఉద్యోగుల జీతభత్యాలను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏడీ) ఆన్‌లైన్ చేయాల్సి వుండగా, ఏడీ, ఆ బిల్లులను రాజేష్ వద్ద చేయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా సిబ్బందికి మూడునెలల బిల్లులు పెండింగ్‌లో వున్న సమయంలో ఆ బిల్లులు చేయటానికి ఏడీ చెప్పిందంటూ రాజేష్ ఒక్కొక్కరి వద్ద రూ.2 నుంచి 3 వేలు వరకూ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా అప్పటి ఏడీ దాత్రేశ్వరిని బదిలీ చేయించారు. అయినా తీరు మార్చుకోని ప్రస్తుత ఏడీ చంద్రకళ కూడా రాజేష్‌ను ఆసుపత్రికి పిలిపించి బిల్లులు చేయిస్తున్నారు. శుక్రవారం రాజేష్ విధులకు వెళ్లకుండా మదనపల్లె ఆసుపత్రికి వచ్చారు. అయినా ఏడీ చేయాల్సిన పనులను వేరే వారివద్ద చేయించటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమే ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్. కోటేశ్వరిని వివరణ కోరగా, పీహెచ్‌సీ ఉద్యోగి ఇక్కడ పనిచేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు.

సోమశిల వెనుక జలాల్లో 2 లక్షల చేప పిల్లలు విడుదల

– ఎఫ్‌డీఓ కిరణ్ కుమార్


సోమశిల జలాల్లో చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కోటపాడు గ్రామం స్టాక్ పాయింట్ నందు ఉన్న సోమశిల వెనుకజలాలలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం క్రింద ఎఫ్‌డీఓ కిరణ్ కుమార్, ఒంటిమిట్ట తహసీల్దార్ వెంకట రమణమ్మలు చేతులు మీదుగా రెండు లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో వ్యవసాయంతో పాటు ఆక్వా రంగాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు మత్స్యరంగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి తోడ్పాటు నందిస్తూ కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగమైనటువంటి చేప పిల్లలను వదలడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ మత్స్య సహాయకురాలు ప్రసన్న క్రాంతి, ఆర్‌వి భాస్కర్ రెడ్డి, రీసర్వే డీటీ స్వరూప, టీడీపీ మండల అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, ఎస్‌వి రమణ, మత్స్య శాఖ సొసైటీ నాయకులు రమణ, చెన్నయ్యలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

మదనపల్లె : ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో విద్యార్థి అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరు తీవ్ర గాయాల పాలైన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలు. మండలంలోని సిటీఎం పంచాయతీ రైల్వే గేట్ సమీపంలో నివసిస్తున్న మనోహర్ విజయ దంపతుల కుమారుడు కార్తీక్ (14), స్థానికంగా తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం స్థానికంగా షామియానా సప్లయర్స్ దుకాణం నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం తో కలిసి, సామాన్లు తరలించేందుకు పోతబోలు పంచాయితీ పుట్టావాండ్లపల్లికు వెళ్లారు. ద్విచక్ర వాహనంలో తిరిగి సుబ్రహ్మణ్యంతో కలిసి సిటిఎంకు వస్తున్నాడు. మార్గమధ్యంలోని కొండవారిపల్లె రైల్వే బ్రిడ్జి వద్ద ఎదురుగా వచ్చిన టిప్పర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో టిప్పర్ వెనక చక్రాలు కార్తీక్ శరీరంపై వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సుబ్రహ్మణ్యం తీవ్ర గాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

ఘనంగా పార్వేట ఉత్సవం


అమ్మవారి దర్శంచుకుంటున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ జాతరలో శుక్రవారం పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గంగమ్మ జాతర నెల రోజుల ముందు ప్రతి ఏటా పుష్యమాసంలో వచ్చే చొల్లంగి అమావాస్య తరువాత వచ్చే పాడ్యమి, తిథి రోజు ప్రతి ఏడాది మాఘమాసంలో అమ్మవారి పూజ సామగ్రిని (యాదవులు) తమ ఇంటి నుంచి గురువారం అర్ధరాత్రి తీసుకొచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకారం చేశారు. పార్వేట తిరునాలకు వేల సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వహణ అధికారి శ్రీనివాసులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అమ్మవారి పూజారులు గంగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం.. చిల్లర దుకాణం దగ్ధం

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లెలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో ఇమామ్ హుస్సేన్ అనే వికలాంగుడికి చెందిన చిల్లర దుకాణం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటిలో చిల్లర దుకాణం పెట్టుకున్న ఇమామ్ హుస్సేన్ గ్రామంలోనే మరో చోట టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లిన తర్వాత ఇమామ్ హుస్సేన్ ఆయన భార్య ఇంటికి తాళం వేసి టిఫిన్ సెంటర్ వద్దకు వెళ్లారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో చుట్టుపక్కల వారు ఇంట్లో నుంచి పొగలు వస్తున్నాయని చెప్పడంతో భార్యాభర్తలు హుటావుటీన ఇంటి వద్దకు వెళ్లారు. తలుపులు తీసి చూడగా చిల్లర దుకాణంలోని వస్తువులు పక్కనే ఉన్న వాషింగ్ మిషన్ ఇతర వస్తువులన్నీ కాలిపోయాయి. దుకాణంలోని క్యాష్ పెట్టెలో ఉన్న రూ.16వేలు నగదు కూడా అగ్నికి ఆహుతి అయింది. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పి వేయడంతో ఇంటిలోని రెండో గదికి మంటలు వ్యాపించలేదు. కాలిపోయిన ఇంటిని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై ఫిర్యాదు

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని చెర్లోపల్లె లేఅవుట్ లోని ఇళ్లకు సంబంధించి గతంలో పనిచేసిన పంచాయతీ సెక్రటరీ ఓబులేసు సంతకాన్ని ఫోర్జరీ చేసి కొన్ని ముఠాలు అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారని పోలీస్ స్టేషన్లో పాపాసాహెబ్ పేట ప్రస్తుత పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. విషయం తెలిసి పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులును వివరణ కోరగా మునుపు పని చేసిన పంచాయతీ సెక్రటరీ ఓబులేసు సంతకాన్ని ఫోర్జరీ చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు సమాచారం రావడంతో పరిశీలించామన్నారు. గత పంచాయతీ సెక్రటరీ సంతకాన్ని, పంచాయతీ కార్యాలయ ముద్రలను ఫోర్జరీ చేసినట్లు, కారకులైన పొన్నేరు సుబ్రహ్మణ్యం, చిట్టిబాబు అనే వ్యక్తులు, ఇతర అనుమానితుల పైన చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినది వాస్తవమేనని తెలిపారు.